నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంజనేయ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ద్వారకానగర్ ఫేస్ 1, 2, కేశవనగర్, ఆంజనేయనగర్, గాయత్రినగర్, లక్ష్మీనగర్ (హుడా) కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మల్లాపూర్ విలేజ్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్వీనగర్, గ్రీన్‌హిల్స్‌కాలనీ, న్యూ భవానీనగర్, బ్రహ్మపురికాలనీ వెంకటరమణ కాలనీ, నాగలక్ష్మీనగర్, పఠాన్‌బస్తీ, జేఎస్ఎన్‌యూ ఆర్ఎం కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ సూర్యనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు శక్తిసాయినగర్, సూర్యనగర్, ఉదయ్‌నగర్, మల్లికార్జుననగర్, గుల్మోర్ గార్డెన్,ఛాండీయానగర్, గోకుల్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాచారంలో...

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ (కాకతీయ కర్షక్) పరిధిలో 11 కేవీ శాంతిగార్డెన్ ఫీడర్, సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతిగార్డెన్ అపార్ట్‌మెంట్స్, ఇందిరానగర్, రాఘవేంద్ర నగర్, కాంక్రీట్ ప్లాజా, అపార్ట్‌మెంట్స్, నాచారం మెయిన్‌రోడ్డు, అన్నపూర్ణ కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు. వైజయంతి ఫీడర్ పరిధిలో.. నేడు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు కౌండిన్యనగర్, వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్డు, రవీంద్ర నగర్, వీరారెడ్డినగర్, ఎర్రకుంట, నాచారం విలేజ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు కాలనీలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హనుమాన్‌నగర్, ఎస్ఆర్ఐ కాలనీ, ఆర్టీసీ కాలనీ, సింధూర్ కాలనీ, శ్రీసాయినగర్, వినాయక్‌నగర్, సాయిసుమ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శాలివాహన ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాలివాహన, కృష్ణానగర్, గౌరీనాథ్‌పురం, పద్మారావునగర్, హైటెక్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడ, మనోజ్ ఎన్‌క్లేవ్, కాప్రా విలేజ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేశానికి ఉత్తమ విద్యార్థులను అందించడం అభినందనీయం

బీజేపీ నేత పేరాల శేఖర్‌జీ

నాగోలు: విద్యార్థులకు ఉత్తమమైన శిక్షణ, విద్య అందిస్తూ వారిని ఉన్నత స్థానాల్లో నిల్పుతున్న రేయాన్ సైనిక్ స్కూల్స్ యాజమాన్యం నిబద్ధతను అభినందించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్‌జీ అన్నారు. ఆలిండియా సైనిక్ స్కూల్–2025 ఫలితాలలో 6,వ తరగతి, 9వ వతరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో మొదటి ర్యాంక్, 4వ ర్యాంక్‌లతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సక్సెస్ మీట్‌ను ఆదివారం నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పరీక్షలలో విజయం సాధించిన హనీష్ రెడ్డి, అమృత్ యాదవ్, శ్రీతేజ, సాకేత్, దీక్షత్‌రాజ్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, అకున్ బాలాజీ, భాను ప్రసాద్‌లతో 260 పైగా మార్కులు సాధించిన 45 మందిని సన్మానించారు. అలాగే 9 వతరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన అశ్వర్థ, ఎన్‌డీఏకు ఎంపికైన జాన్‌సన్, రూపేష్, జయంత్, అభిరామ్, రఘునందన్, ప్రణవ్‌లను బీజేపీ జాతీయ నాయకులు శేఖర్‌జీ, స్కూల్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, డైరెక్టర్ ఉమాదేవిలు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ రేయాన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. సివిల్ సర్వెంట్స్‌గా, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాలు, ఎన్‌డీఏలో అవకాశాలు లభించాయన్నారు. రేయాన్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ రేయాన్ స్కూల్‌లో అత్యున్నతమైన విద్యతో పాటు సామాజిక అవగాహన, ఉన్నతమైన విలువలు నేర్పుతున్నామని తెలిపారు.

వార్డు కార్యాలయాన్ని తొలగించొద్దని ధర్నా

కీసర: కీసర వార్డు కార్యాలయాన్ని తొలగించొద్దని బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఆదివారం కీసరచౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ వెంకటేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కీసర మండలాన్ని ప్రత్యేక మున్సిపాలిటీగా చేయలేదని, కీసర గ్రామపంచాయితీని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనం చేశారన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీకి కీసర నుంచి వెళ్లాలంటే చాలా దూరం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి తమ వార్డు కార్యాలయాన్ని తమకే ఉంచాలని కోరారు. కాంగ్రెస్ నేతలు ముద్దం వెంకటేష్, రాజు, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ఆక్రమణలు ఆగేదెలా..?

- ర్యాంప్‌లు, మెట్ల నిర్మాణంతో.. కుచించుకుపోతున్న అంతర్గత రహదారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు


రోడ్డు పక్కనే ఎవెన్యూ ప్లాంటేషన్

బోడుప్పల్ : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో కొంతమంది ఇళ్ల యజమానులు రోడ్లన్నీ ఆక్రమించుకుని ర్యాంప్‌లు, మెట్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి కారణంగా పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు కుచించుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

రోడ్లపై నీరు.. దెబ్బతింటున్న రహదారులు..

ఇళ్లలోని నీరు రోడ్లపైకి యథేచ్ఛగా వదులుతుండటంతో అవి రోడ్లపై పారి రహదారులు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా రోడ్లను ఆక్రమించుకుని ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు పెడుతున్నారనే విమర్శలున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ కోసం రోడ్డుపైనే షెడ్‌లు వేసి పార్కింగ్ చేస్తున్నారు. వీటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బోడుప్పల్‌లో అన్నీ ఇరుకైన రోడ్లే..

లక్ష్మీనగర్ (హుడా లేఅవుట్) మినహా.. మిగతావన్నీ గ్రామపంచాయతీ లేఅవుట్లే. కొన్ని ప్రధాన రహదారులు 30 అడుగులు ఉండగా.. మరికొన్ని 20– 15 అడుగులు మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన టీఎస్ బీపాస్ ప్రకారం 150 గజాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు ప్రధాన రహదారి వైపు 5 అడుగులు, మిగతా మూడు వైపుల 3 అడుగుల చొప్పున స్థలం వదిలిపెట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు చేపట్టే యజమానులు వాటిని పట్టించుకోకుండా.. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా హద్దులపై నిర్మాణాలు చేపడుతున్నారు.

ర్యాంప్‌లు, మెట్లు తొలగించాలని తీర్మానం..

గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పాలకవర్గం ఉన్నప్పుడు స్థానికుల నుంచి ర్యాంప్‌లు, మెట్లపై పలు ఫిర్యాదుల అందాయి. నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన 4వ పట్టణ ప్రగతి ప్రత్యేక సమావేశంలో రోడ్లు ఆక్రమించుకుని నిర్మించిన ర్యాంప్‌లు, మెట్లు, రోడ్డుపైనే పెట్టిన ఎవెన్యూ ప్లాంట్స్, అక్రమంగా నిర్మించిన షెడ్‌లను తొలగించాలని తీర్మానించారు. రోడ్డుపై నీళ్ల వదిలేవారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు విధించాలని తీర్మానించారు. కొద్ది రోజుల తర్వాత వాటిపై చర్యలు తీసుకుంటే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమౌతున్నాయి.

రోడ్లపై నీళ్లు పోసేవారిపై చర్యలు తీసుకోవాలి..

రోడ్లుపై నీరు పోయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కొంతమంది రోడ్డును ఆక్రమించుకుని ర్యాంప్‌లు, మెట్లు, ఎవెన్యూ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. వారిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రోడ్లు కబ్జాకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై అధికారులు చొరవ తీసుకుని రోడ్లు ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– ఆర్. వీరారెడ్డి, బోడుప్పల్

'బస్తీబాట'తో సమస్యల పరిష్కారం


అన్నపూర్ణ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న అనిల్‌కుమార్

మల్లాపూర్: అన్నపూర్ణకాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఆయన ఇంటింటికి తిరిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి మట్లాడుతూ.. కాలనీల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, అన్నపూర్ణ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు భానుచందర్‌రెడ్డి, చౌదరి, మన్నన్, రషీద్, విలయత్‌ఖాన్, హనన్, శ్రీశైలం, శ్రీనివాస్, సత్యనారాయణ, సంజయ్, వెంకన్న, శ్రీనివాస్, పవన్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వైజాగ్‌లో నిర్వహించిన నేషనల్ బాండీ ఫెడరేషన్ కప్–2025లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన యాప్రాల్ అర్ష స్కేటింగ్ అకాడమీ విద్యార్థులను ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో అత్యధిక పతకాలు సాధించి చాంపియన్ ట్రోఫీని గెలుచుకోవడం రాష్ట్రం, అకాడమీకి గర్వకారణమన్నారు. కోచ్ ఎండీ.నసీరుద్దీన్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

– ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


సత్యవతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన నేతలు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఎవ్వరికీ కష్టం వచ్చినా ఆదుకుంటానన్నారు. ఈ మేరకు చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సత్యవతి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి ముచ్చటించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. స్థానిక నేతలు తదితరులున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేసిన దృశ్యం

గౌతంనగర్ : డివిజన్ మల్లికార్జుననగర్‌లోని గంగపుత్రభవన్‌లో మల్కాజిగిరి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సంఘం అధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి ఆదిశంకర్, ట్రెజరర్ ఎల్లయ్య, నాయకులు బైరు అనిల్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ హెచ్‌ఎంటీ కాలనీలో సైకిల్ ర్యాలీ

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం !

అల్వాల్: కాలుష్యాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని, అల్వాల్ హెచ్‌ఎంటీ కాలనీలో పర్యావరణ ప్రేమికులు అల్వాల్ హెచ్‌ఎంటీ కాలనీలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అల్వాల్‌లోని పలు కాలనీల్లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. జాతీయ జెండా చేతబూని చిన్నారులు, వృద్ధులు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆలయానికి భూమిపూజ


భూమిపూజలో పరమేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు

ఉప్పల్: డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో భ్రమరాంబికామల్లికార్జునస్వామి ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని స్థానికులు వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కాలనీవాసులు సత్తిరెడ్డి, కాంగ్రెస్ నేతలు రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్, బన్నీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ వెస్ట్ జోన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తలారి రవియాదవ్, ప్రధాన కార్యదర్శులుగా బానుకుంట వేణుగోపాల్, దొంతి నవీన్, ఉపాధ్యక్షులుగా కాటపల్లి ముత్యంరెడ్డి, నందకుమార్ జోషి, ప్రేమ్‌కుమార్, బాల సత్యనారాయణ, కోశాధికారిగా జయరమేష్ శెట్టి, కార్యదర్శులుగా ఆనంద్‌రెడ్డి, సతీష్, రోజా, తిరుమలేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తలారి రవియాదవ్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యే పర్యటన


ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లోని సాయికృష్ణ ఎన్‌క్లేవ్ ఫేజ్–1,2లో ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, కాలనీవాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కాలనీవాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


కల్యాణి

కాప్రా: విధులకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లేష్, కల్యాణి దంపతులు గౌరీనాథ్‌పురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 6న కల్యాణి(34)కి ఏఎస్‌రావునగర్‌లోని ఓ క్లాత్ స్టోర్‌లో పనికి చేరింది. 7న విధులకు వెళ్లడం ప్రారంభించిన క్రమంలో రాత్రి 9 గంటలైనా తిరిగి ఇంటికి రాలేదు. భర్త కాల్ చేయగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో స్టోర్‌కు వెళ్లి ఆరా తీశాడు. ఆమె 7.30 గంటలకే వెళ్లిపోయిందని నిర్వాహకులు సమాధానం ఇచ్చారు. దీంతో తెలిసిన చోట వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో భర్త ఆదివారం కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నిమిషాంబదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు


సామూహిక చండీహోమంలో పాల్గొన్న భక్తులు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని మాతా నిమిషాంబదేవి 19వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 6 గంటలకు సుప్రభాతం, దేవతా ప్రార్థన, గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, ధ్వజారోహణ, కలశస్థాపన, మూలమంత్ర, హోమం, ఉదయం 10 గంటలకు సామూహిక చండీహోమం నిర్వహించామన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం


ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

- కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యనిర్వాహణ అధికారి వెంకన్న, సంపత్‌రావు, శ్రీనివాస్, నారాయణ, మల్లేష్‌గౌడ్, విజయకుమారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హిమగిరి కూచిపూడి అకాడమీ, సైరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశకౌతం, పలుకే బంగారమాయేనా, కృష్ణ శబ్దం, కమల సులోచన, అష్టపది, మానస సంచరరే, అదివో అల్లదిగో, చిదంబర కౌతం, తాండవ నృత్యకారి తదితర అంశాలు కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో కార్పొరేటర్ శాంతి

అల్వాల్: తెలంగాణ, తమిళ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అల్వాల్ డివిజన్ కొత్తబస్తీలోని అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో లైఫ్‌లైన్ తులసీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విశాల్, రాకేష్, అరవింద్, మహేష్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటుపై నిరసన



మచ్చబొల్లారం డంపింగ్‌యార్డు వద్ద నిరసన చేస్తున్న కాలనీ ప్రతినిధులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని హిందూ శ్మశానవాటిక స్థలంలో డంపింగ్‌యార్డు ఏర్పాటును నిరసిస్తూ.. పలు కాలనీలవాసులు ఆదివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. దాతలు హిందూ శ్మశానవాటికకు దానం ఇచ్చిన స్థలాన్ని స్వాధీనం చేసుకున్న జీహెచ్‌ఎంసీ కొంతకాలం తాత్కాలిక పనుల పేరుతో డంపింగ్‌యార్డును నిర్వహించి, ప్రస్తుతం శాశ్వతంగా భారీషెడ్లు ఏర్పాటు చేస్తుందని, దీంతో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. హామీలు ఇస్తున్నారే తప్పా.. అమలు చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర


మారుతీనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

గౌతంనగర్: మల్కాజిగిరి డివిజన్ మారుతీనగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుపై మొక్క నాటాలని కోరారు. అదే విధంగా కాలనీవాసులు తెలపిన పలు సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు. కాలనీ అధ్యక్షులు శంఖు, ప్రధాన కార్యదర్శి హరినాథ్‌గౌడ్, జైకృష్ణ, ఆనంద్, శంకర్, అంజి, సుబ్రహ్మణ్యం, జ్ఞానేశ్వర్, రవి, జశ్వంత్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో కిశోర్‌గౌడ్

రూ.45 లక్షలతో సీసీ రోడ్డు పనులు

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మేడ్చల్ నియోజకవర్గ బి– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అన్నారు. రాజలింగం కాలనీ ఫేస్–2లో రూ. 45లక్షలతో ఆదివారం సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, మైనార్టీ అధ్యక్షులు అక్బర్ కాలనీవాసులు పాల్గొన్నారు.